నగరంలో ఎన్ఐఏ

● ఏకబిగిన 12 చోట్ల తనిఖీలు


నాగర్‌కోవిల్‌లో మహమ్మద్ అలీ నివాసం వద్ద ఎన్ఐఏ అధికారులు, పోలీసులు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సంస్థలకు సభ్యులను చేర్పించి, ఆ సంస్థలకు మద్దతుగా వ్యవహరిస్తూ, యూట్యూబ్ ఛానెళ్లలో ప్రసంగాలు చేశారంటూ కొంతమంది ముస్లిం యువకులపై నమోదైన కేసుల నేపథ్యంలో.. ఎన్ఐఏ అధికారులు చెన్నై సహా 12 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఒకే సమయంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సందర్భంగా కీలకమైన పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. నగరంలో నిషేధిత ఉగ్రవాద సంస్థ 'హిస్బుత్ ఉల్-తహిరీర్'లో సభ్యులను చేర్పించిన వ్యవహారం మే నెలలో తీవ్ర కలకలం సృష్టించింది. యూట్యూబ్ ఛానెళ్లలో నిషేధిత ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా అభిప్రాయాలు వెల్లడించేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రసంగాలు చేసేవారిపై గ్రేటర్ చెన్నై పోలీసులు నిఘా వేశారు. ఆ మేరకు రాయపేటలోని జానీ జాన్‌ఖాన్ వీధిలో కార్యాలయం నడుపుతూ నిషేధిత ఉగ్రవాద సంస్థకు సభ్యులను చేర్పించినట్లు గుర్తించారు. ఆ సంఘటనకు సంబంధించి చెన్నై సెంట్రల్ క్రైం విభాగం సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి హమీద్ హుసేన్, అతడి తండ్రి మన్సూర్, సోదరుడు అబ్దుల్ రెహ్మాన్, వీరి స్నేహితులు మహమ్మద్ ఖాదర్ నవాజ్, షెరీఫ్, అహమ్మద్ అలీని అరెస్టు చేసి జైలుకు తరలించారు. పోలీసుల విచారణలో ఈ ఆరుగురూ ఇతర జిల్లాల్లో పర్యటించి నిషేధిత ఉగ్రవాద సంస్థకు సభ్యులను చేర్పించినట్లు వెల్లడైంది. ఇతర రాష్ట్రాల్లోనే కాకుండా విదేశాల్లోనూ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగించినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. ఈ కారణంగా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను చెన్నై సైబర్ క్రైం నుంచి జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) అధికారులు తీసుకున్నారు. అనంతరం వారు రాయపేటలోని కార్యాలయం తదితర ప్రాంతాలకు వెళ్ళి విచారణ జరిపి సమాచారం సేకరించారు. ఆ సందర్భంగా నిషేధిత ఉగ్రవాద సంస్థకు మద్దతుగా హమీద్ హుసేన్ యూట్యూబ్ ఛానెళ్లలో ప్రసంగించినప్పుడు పలువురు మద్దతుగా అభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయాన్ని తెలుసుకున్నారు. మద్దతుగా అభిప్రాయాలు వెల్లడించినవారి వివరాలను కనుగొనేందుకు ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆ దర్యాప్తులో చెన్నై, సబర్బన్ ప్రాంతాలు, నాగర్‌కోవిల్, పుదుకోట జిల్లాల్లోనూ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పలువురు వ్యవహరించి ఆ సంస్థకు కొత్త సభ్యులను చేర్పించినట్లు కనుగొన్నారు. ఆ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం చెన్నైలోని పది ప్రాంతాల్లోనూ, నాగర్‌కోవిల్, పుదుకోటలో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు జరిపారు. మొత్తం 12 చోట్ల ఒకే సమయంలో తనిఖీలు కొనసాగాయి. చెన్నైలోని ఏళుకినరు (సెవెన్‌వెల్స్), రాయపేట, ట్రిప్లికేన్, చీట్లపాక్కం, తాంబరం, వండలూరు, వెట్టువాంగణి, నన్మంగళం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేసి, ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా వ్యవహరించిన వ్యక్తుల నివాసాల్లో ఎన్ఐఏ అధికారులు విచారణ జరిపారు. ఏళుకినరులో నివసిస్తున్న రహ్మాన్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు విచారించారు. కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్ ఇలంగడై ప్రాంతంలో మహమ్మద్ అలీ అనే వ్యక్తి ఇంటిలో చెన్నై నుండి వెళ్ళిన ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేశారు. తిరునల్వేలి జిల్లాకు చెందిన ఈయన ఇమామ్‌గా వ్యవహరిస్తున్నట్లు వెల్లడైంది. నాగర్‌కోవిల్ వట్టవిళై ప్రాంతం నుండి రెండు వారాల క్రితం మహమ్మద్ అలీ ఇలంగడై ప్రాంతానికి వచ్చాడని గుర్తించారు. ఎన్ఐఏ అధికారులు వెళ్ళినప్పుడు ఇంటిలో మహమ్మద్ అలీ ఇంటిలో లేడు. దీంతో అతడి భార్యను ఎన్ఐఏ అధికారులు ప్రశ్నించారు. పుదుకోట జిల్లా మండయూరు సమీపం వడకాడు ప్రాంతంలో నివసిస్తున్న అబ్దుల్లా ఖాన్ ఇంటిలోనూ ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గత జూన్‌లోనూ ఆ ఇంటిలో ఎన్ఐఏ అధికారులు తనిఖీ చేశారు. మంగళవారం మళ్ళీ అధికారులు తనిఖీచేసి కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

మద్రాసు హైకోర్టులో ఐదుగురు న్యాయమూర్తుల పదవీ ప్రమాణం

పెరంబూర్, సెప్టెంబరు 24: మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తులు ఐదుగురు శాశ్వత న్యాయమూర్తులుగా పదవీ ప్రమాణం చేశారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కృష్ణకుమార్ మంగళవారం వారితో ప్రమాణం చేయించారు. జస్టిస్ విక్టోరియా గౌరి, జస్టిస్ బాలాజి, జస్టిస్ రామకృష్ణన్, జస్టిస్ కలైమతి, జస్టిస్ తిలకవతి మంగళవారం శాశ్వత న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఐదుగురు 2023లో మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, హై కోర్టు రిజిస్ట్రార్ జనరళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


కొళత్తూరు జీకేఎం కాలనీలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన అనంతరం, కొత్త కార్పొరేషన్ పాఠశాలలోని బాలికలకు విద్యా సామగ్రి అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కొళత్తూరులో రూ.4.76 కోట్లతో కొత్త భవనాలు

● ప్రారంభించిన ముఖ్యమంత్రి

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొళత్తూరు నియోజకవర్గ పరిధిలో రూ.4.76 కోట్లతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం, పునర్నిర్మిత వ్యాయామ కేంద్రం తదితర భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. అదే విధంగా కొత్తగా నిర్మిస్తున్న సామాజిక సంక్షేమ కేంద్ర భవన నిర్మాణ పనులు, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో కూడిన కొళత్తూరు ప్రజా సేవా కేంద్రం నిర్మించనున్న స్థలాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కొళత్తూరు జీకేఎం కాలనీ జరిగిన కార్యక్రమంలో అక్కడి 12 వ వీధిలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పాఠశాల కోసం సింగార చెన్నై 2.0 నిధుల కింద రూ.2.43 కోట్లతో దిగువ అంతస్థు, మొదటి అంతస్థు, ఎంపీ పి.విల్సన్ నియోజకవర్గ నిధుల నుండి కేటాయించిన రూ.1.80 కోట్లతో రెండో అంతస్థుతో నిర్మించిన పాఠశాల భవనాన్ని స్టాలిన్ ప్రారంభించారు. మదురైసామి మఠంలో రూ.26.43 లక్షలతో కొత్త పరికరాలు, మరుగుదొడ్లు స్టోర్‌రూమ్‌తో పునర్నిర్మించిన వ్యాయామ కేంద్రం, నేర్మయ్ నగర్ శ్మశానవాటికలో రూ.26.29 లక్షలతో నిర్మించిన అంతిమ క్రియ స్మారక మండపాన్ని కూడా ఆయన ప్రారంభించారు. అంతకు ముందు కొత్తగా ప్రారంభించిన పాఠశాలలో బాలబాలికలకు పుస్తకాల సంచులను, విద్యా ఉపకరణాలను కూడా సీఎం పంపిణీ చేశారు.

సామాజిక కేంద్రం నిర్మాణ పనుల పరిశీలన..

కొళత్తూరు ముత్తుకుమారప్పా వీధిలో రూ.13.47 కోట్లతో డైనింగ్ హాలు, వివాహవేదిక, రెస్ట్‌రూమ్, పార్కింగ్ ఏరియా తదితర సదుపాయాలతో మూడంతస్థుల సామాజిక కేంద్రం నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు.

ఇదేవిధంగా ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద సీఎండీఏ ఆధ్వర్యంలో కొళత్తూరు పేపర్ మిల్స్ రోడ్డులో రెవెన్యూ శాఖకు చెందిన 0.74 ఎకరాల స్థలంలో కొత్తగా తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, కో - వర్కింగ్ స్పేస్, వాణిజ్య సముదాయాలతో రూ.32 కోట్లతో నాలుగంతస్థుల సిటిజెన్ సర్వీస్ సెంటర్ నిర్మాణ పనులను కూడా సీఎండీఏ అధికారులు, మంత్రులతో కలిసి స్టాలిన్ పరిశీలించారు.

పార్టీ సేవకులకు సత్కారం..

ఆ తర్వాత కొళత్తూరులోని తన అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో డీఎంకే స్థానిక కార్యకర్తలు, ప్రముఖులు 443 మందిని స్టాలిన్ సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు పి.విల్సన్, కళానిధి వీరాసామి, ఆర్.గిరిరాజన్, శాసనసభ్యులు తాయగం కవి, జోసెఫ్ సామువేల్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధ్యక్షుడు పి.రంగనాథన్, గృహవసతి నగరాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉష, చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ (సీఎండీఏ) మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, చెన్నై తాగు నీటి సరఫరా, మురుగునీటి తొలగింపు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డీజీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విడతల వారీగా మద్యం దుకాణాల మూసివేత

● మంత్రి ముత్తుస్వామి


కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న మంత్రి ముత్తుస్వామి

పెరంబూర్,సెప్టెంబరు24:రాష్ట్రంలో విడతలవారీగా మద్యందుకాణాలు మూసివేసేలా చర్యలు చేపట్టనున్నామని గృహవసతి, ఎక్సైజ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి తెలిపారు. మూసివేయనున్న టాస్మాక్ మద్యం దుకాణాల వివరాలు సేకరిస్తున్నామని, త్వరలో ఆ దుకాణాల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈరోడ్ ముత్తపాళయం సమీపంలోని పెరుంపల్లం కాలువ పూడికతీత పనులను మంత్రి ముత్తుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... టాస్మాక్ దుకాణాలు మూసివేసియడంపై తమకెలాంటి సూత్రప్రాయమైన విభేదాలు లేవన్నారు.ఒకేరోజు మద్యం దుకాణాలు మూసివేస్తే ఎన్నో ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఒక ప్రాంతంలో మద్యం దుకాణం మూసేస్తే, అక్కడ ఏదైనా తప్పు జరుగుతుందా అనే విషయం పరిశీలించాల్సి ఉంటుందన్నారు. మద్యం దుకాణాలు మూసేస్తే ఆ ప్రాంతంలోని మద్యం ప్రియులు ప్రశాంతంగా ఉంటారని ఖచ్చితంగా చెప్పలేమన్నారు. మద్యం దుకాణాలు మూసే సమయంలో, వారిని ఆ అలవాటు నుండి దూరం చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టాస్మాక్ దుకాణాలపై సర్వే చేస్తే, విక్రయాలు పెంచడమ కోసమేనని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. టాస్మాక్ దుకాణాల్లో ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నాయా, లేదా అనే విషయమై అధికారులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా మద్యం దుకాణాల మూసివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడితే, రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల మూసివేతకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నామని, త్వరలోనే మూసివేసే దుకాణాల జాబితా విడుదల చేస్తామని మంత్రి ముత్తుస్వామి స్పష్టం చేశారు.

త్వరలో మంత్రివర్గ మార్పులు

ఆశించేవారికి నిరాశ ఉండదు ● ముఖ్యమంత్రి స్టాలిన్ నర్మగర్భ వ్యాఖ్యలు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. మంగళవారం ఉదయం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు శాసనసభ నియోజకవర్గంలో కార్పొరేషన్, సీఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ... మంత్రివర్గంలో తప్పకుండా మార్పులు జరుగుతాయని, అవి ఎవరూ నిరాశచెందేలా ఉండవని స్పష్టం చేశారు. మంత్రి ఉదయనిధికి డిప్యూటీ సీఎం కావటం ఖాయమంటూ మంత్రి వర్గ సహచరులు, పార్టీ నేతలు పదేపదే చెబుతున్న విషయాన్ని విలేఖరుల ఆయన దృష్టికి తీసుకెళ్లగా అందరూ ఆశించే విధంగానే మంత్రివర్గ మార్పులు జరుగుతాయంటూ, నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం జిల్లా కలెక్టర్లతో తరచూ వర్షం, వరద ముందస్తు జాగ్రతల విషయమై చర్చలు జరుపుతున్నారని, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. తనను శాసనసభ్యుడిగా ఎన్నుకున్న కొళత్తూరు ప్రజలు ఎల్లప్పుడూ తనపట్ల ఆదరాభిమానాలను ప్రదర్శిస్తున్నారని, అందుకే తరచూ నియోజకవర్గంలో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నానన్నారు. అమెరికా పర్యటన సందర్భంగా విదేశీ పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రధాన ప్రతిపక్ష నేత ఈపీఎస్ డిమాండ్ చేయడంపై ఆయన స్పందిస్తూ ఈ విషయమై పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా సమగ్రమైన వివరాలతో ప్రకటన చేశారని తెలిపారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో విదేశీ పెట్టుబడుల సమీకరణ ఎలా జరిగిందో ప్రజలందరికీ తెలిసేందేనని ఆయన ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో పెరుగుతున్న లైంగిక వేధింపులు

● మెగా ధర్నాలో అన్నాడీఎంకే మహిళా విభాగం నేతలు


ధర్నాలో మాజీ మంత్రులు వలర్మతి, గోకుల ఇందిర తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 24: రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టలేని డీఎంకే ప్రభుత్వ తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో నుంగంబాక్కం సమీపంలోని వళ్లువర్‌కోట్టం వద్ద మంగళవారం మహా ధర్నా చేశారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, హత్య, హత్యాయత్నం, దోపిడీ, దౌర్జన్యాలు విచ్చలవిడిగా సాగుతుండడంతో మహిళలకు స్వేచ్ఛ లేదని, వాటిని అరికట్టడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ తమ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలియజేయనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు.

ఆ మేరకు వళ్లువర్‌కోట్టం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ మంత్రి పి.వలర్మతి సారథ్యం వహించారు. ఈ ధర్నాలో చెన్నై, శివారు జిల్లాలకు చెందిన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. ధర్నాలో వలర్మతి మాట్లాడుతూ పోలీసులకున్న అధికారం తగ్గించడంతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోను హింసాత్మక సంఘటనలు ప్రతినిత్యం జరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళలకు భద్రత కరువైందన్నారు. ఈ సమస్యలన్నీ తీరాలంటే మళ్లీ రాష్ట్రంలో అన్నాడీఎంకే అధికారం చేపట్టే విధంగా మహిళలంతా పాటుపడాలని ఆమె పిలుపునిచ్చారు. మాజీ మంత్రి గోకుల ఇందిర, సినీ నటీమణులు వింధ్య, గాయత్రి రఘురామ్, ఎమ్మెల్యే మరకదం కుమరవేల్ సహా ఆందోళనకారులు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు.

చెస్ ఒలంపియాడ్ విజేతలకు ఘనస్వాగతం


విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతున్న ప్రజ్ఞానంద, వైశాలి. శ్రీనాథ్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హంగేరిలో జరిగిన 45వ చెస్ ఒలంపియాడ్‌లో స్వర్ణపతకాలు గెలుచుకుని నగరానికి తిరిగొచ్చిన చదరంగం క్రీడాకారులు గుకేష్, ప్రజ్ఞానంద, వైశాలికి ఘన స్వాగతం లభించింది. చెస్ ఒలంపియాడ్‌లో భారత పురుషుల జట్టు, మహిళల జట్టు స్వర్ణ పతకాలు గెలిచి సరికొత్త రికార్డు నెలకొల్పాయి. చెన్నైకి చెందిన చెస్ క్రీడాకారులు డి.గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ ఎరికేశి, విదిత్ గుజరాత్తి, హరికృష్ణతో కూడిన భారత జట్టు ఓపెన్ విభాగంలోను, వైశాలి (చెన్నై) తానియా, హరికా, వత్తికా, దివ్యా తదితరులతో కూడిన మహిళా జట్టు స్వర్ణపతకాలు గెలుచుకున్నాయి. చెస్ ఒలంపియాడ్ చరిత్రలో భారతజట్టు స్వర్ణ పతకాలు గెలుచుకోవడం ఇదే ప్రథమం. ఇంతకు ముందు పురుషుల జట్టు రెండు సార్లు (2014, 2022), మహిళ జట్టు ఓ సారి (2022) కాంస్య పతకం మాత్రమే సాధించింది.. ఈ నేపథ్యంలో చెస్ ఒలంపియాడ్‌లో స్వర్ణ పతకాలు గెలుచుకుని నగరానికి తిరిగొచ్చిన గుకేష్, ప్రజ్ఞానంద, వైషాలి, కెప్టెన్ శ్రీనాథ్ తదితరులకు విమానాశ్రయంలో క్రీడా సంస్థల నిర్వాహకులు, క్రీడాభిమానులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ సుజాత, రాష్ట్ర చెస్ సంఘం కార్యదర్శి స్టీఫన్ బాలసామి, కోశాధికారి ఆర్.శినివాసన్, వేలమ్మాళ్ స్కూలు కరస్పాండెంట్ ఎంవీఎం వేల్ మురుగన్, రాష్ట్ర క్రీడాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఐ.అయ్యప్ తదితరులు పూలమాలలు వేసి, శాలువలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైశాలి మాట్లాడుతూ.. చెన్నైలో జరిగిన చెస్ ఒలంపియాడ్‌లో కాంస్య పతకం గెలిచుకున్నామని, ఆ సమయంలో స్వర్ణపతకం సాధించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ప్రస్తుతం స్వర్ణపతకం గెలుచుకోవడం తమకెంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఓపెన్ విభాగంలో పురుషుల జట్టు అత్యధిక పాయింట్లతో గెలిచిందని, మహిళల జట్టు ఓ రౌండ్‌లో ఓడిపోవటంతో మిగిలిన రెండు రౌండ్లలో తప్పకుండా గెలవాల్సి వచ్చిందని, చివరకు చివరి రెండు రౌండ్లలో విజయం సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. గత చెస్ ఒలంపియాడ్‌లో స్వర్ణపతాకాన్ని ఆఖరి క్షణంలో జారవిడుచుకున్నామని, ఈ సారి అత్యధిక పాయింట్లతో స్వర్ణపతకాన్ని గెలుచుకోగలిగామని చెప్పారు. ఆడిన అన్ని రౌండ్లు చాలా టఫ్‌గానే సాగిందని, ఫస్ట్‌ప్లేస్‌లో ఉన్న అమెరికాను ఓడించగానే స్వర్ణపతకం గెలుచుకోవడం ఖరారైపోయిందన్నారు.

సమాచార ధ్వని

27న జాషువా జయంతి

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'విశ్వనరుడు' జాషువా 130వ జయంతి ఈ నెల 27వ తేదీ జరుగనుంది. 'సాహిత్యకారుల జీవన చిత్రాలు' కార్యక్రమంలో భాగంగా మెరీనాలోని రజతోత్సవ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతం పలుకనుండగా, నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనా గీతం ఆలపించనున్నారు. తెలుగుశాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమానికి వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జలదంకి కోదండరామిరెడ్డి ముఖ్య అతిథిగా, జనని అధ్యక్షులు డాక్టర్ నిర్మలా పళనివేలు విశిష్ట అతిథిగా, ఆకాశవాణి విశ్రాంత ఉద్ఘోషకురాలు బిట్రా గజగౌరి ఆత్మీయ అతిథిగా హాజరు కానుండగా, మద్రాస్ క్రైస్తవ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ శ్రీపురం యజ్ఞశేఖర్, నూజివీడులోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ జడా సుబ్బారావు ఉపన్యసించనున్నారు. డాక్టర్ పాండరంగం కాళియప్ప వందన సమర్పణతో కార్యక్రమం ముగియనుంది.

గ్రూప్-2, 2ఏ పరీక్షల ఆన్సర్ కీ విడుదల

పెరంబూర్, సెప్టెంబరు 24: తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-2 విభాగంలో 507 పోస్టులు, గ్రూప్-2ఏ విభాగంలో 820 పోస్టులకు ఈ నెల 14వ తేది రాతపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు 5.81 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షల ఆన్సర్ కీ https://tnpsc.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. అభ్యర్థులు ఏవైనా ఆక్షేపణలుంటే ఈ నెల 30వ తేది సాయంత్రం 5.45 గంటల్లోపు www. tnpsc.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

27 నుంచి తిరుచ్చిలో బుక్ ఎగ్జిబిషన్

పెరంబూర్, సెప్టెంబరు 24: తిరుచ్చి సీఎస్ఐ సెయింట్ జాన్స్ వెస్ట్రీ మహోన్నత పాఠశాలలో ఈ నెల 27 నుంచి అక్టోబరు 6వ తేది వరకు బుక్ ఎగ్జిబిషన్ జరుగనుంది. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ ప్రదర్శనలో సదస్సులు, కొత్త పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. వివిధ సంస్థలు సుమారు 200లకు పైగా స్టాల్స్ ఏర్పాటుచేయనున్నాయని, ఈ సందర్భంగా పుస్తకాల కొనుగోళ్లపై ప్రత్యేక రాయితీ అందించనున్నట్లు ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి కోవైలో 'ఫార్మర్స్ డే 2024'

పెరంబూర్, సెప్టెంబరు 24: కోయంబత్తూర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 29వ తేది వరకు 'ఫార్మర్స్ డే 2024' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు విత్తన, ఎరువుల సంస్థలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో సుమారు 200లకు పైగా స్టాల్స్ ఏర్పాటుచేయనున్నారు. సాగులో నూతన పద్ధతులు, అధిక దిగుబడులు అందించే విత్తనాల సహా పలు అంశాలపై నిపుణులు సూచనలు, సలహాలు అందించనున్నారని, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిపొందాలని వర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

మేట్టుపాళయం-ఊటీ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 24: విజయదశమి, దీపావళి, క్రిస్టమస్, నూతన సంవత్సరం సందర్భంగా మేట్టుపాళయం-ఊటీ మధ్య ప్రత్యేక కొండ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఈ నెల 11 నుంచి 14వ తేది వరకు, నవంబరు 1 నుంచి 4వ తేది, డిసెంబరు 25 నుంచి జనవరి 1వ తేది వరకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. అలాగే, కూనూరు-ఊటీ మధ్య ఈ నెల 12,13, నవంబరు 2,3, డిసెంబరు 28 నుంచి జనవరి 2వ తేది వరకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

హజ్ యాత్ర దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 24: హజ్ యాత్రకు దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 30వ తేది వరకు పొడిగించినట్లు భారత హజ్ అసోసియేషన్ అధ్యక్షుడు అబూబకర్ తెలిపారు. 2025వ సంవత్సరం భారత్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారి నుంచి దరఖాస్తు స్వీకరణ జరుగుతోంది. ఈ క్రమంలో, దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 30వ తేది వరకు పొడిగించినట్లు కేంద్ర మైనార్టీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసిందని అబూబకర్ తెలిపారు.

పాలిటెక్నిక్‌ల్లో 92 వేల సీట్లు ఖాళీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: పాలిటెక్నిక్ కళాశాలల్లో 92,000 సీట్లు ఖాళీగా ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టరేట్ తెలిపింది. ఈ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో 54 ప్రభుత్వ, 4 అనుబంధ, 32 ఎయిడెడ్, 401 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో మొత్తం 1.5 లక్షల సీట్లున్నాయి. 2024-25వ విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు 58,000 సీట్లు భర్తీ అయ్యాయి. 'ఉయరుక్కు పడి' ప్రత్యేక శిబిరాల ద్వారా ప్లస్ టూ ఉత్తీర్ణులైన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో చేరుతున్నారు. అయినప్పటికీ, ప్రస్తుతం 92,000 సీట్లు ఖాళీగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

అయ్యర్ ఆలయానికి రోప్‌కార్ సేవలు పునఃప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 24: కరూర్ జిల్లా కులిత్తలై సమీపం అయ్యర్ కొండపై రత్నగిరీశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ కొండ ఆలయానికి మెట్ల మార్గం ఉండగా, వృద్ధులు, పిల్లల సౌకర్యార్థం రూ.9.10 కోట్లతో రోప్‌కార్ సేవలను ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ రోప్‌కార్ సేవలు సాంకేతికలోపం కారణంగా కొద్దిరోజులు నిలిపివేశారు. మరమ్మతులు పూర్తికావడంతో మంగళవారం నుంచి రోప్‌కార్ సేవలు పునఃప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

పది లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: పది లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేసేందుకు వ్యవసాయ శాఖ లక్ష్యం నిర్దేశించింది. వరి, చెరకు, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. పౌష్టిక పదార్థాలు, కోళ్ల దాణా, ఎథనాల్ తయారీకి మొక్కజొన్న అధికంగా వినియోగిస్తుండడంతో, దీని అవసరం పెరిగింది. దీంతో ఉత్పత్తి పెంచేలా రైతులను వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. 18 జిల్లాల్లో జొన్న విత్తనాలు, ద్రవ ఎరువులు, సహజ ఎరువులు, నానో యూరియా వంటి వాటిని 50,000 మంది రైతులకు అందజేసే పనులు ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరం మొక్కజొన్న 10.1 లక్షల ఎకరాల్లో సాగుచేసేందుకు లక్ష్యం నిర్దేశించారు.

జలాశయాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, సెప్టెంబరు 24: నగరవాసులకు తాగునీరందించే చెంబరంబాక్కం, చోళవరం జలాశయాలకు నీటి రాక స్వల్పంగా పెరిగింది. నగరం, శివారు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా చెంబరంబాక్కం జలాశయానికి 220 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతుండగా, తాగునీటి అవసరాలకు 109 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు.

పాఠశాల గదులను శుభ్రం చేసిన మేయర్

ఐసిఎఫ్, సెప్టెంబరు 24 : కడలూరు కార్పొరేషన్ మేయర్ సుందరి రాజా ఓ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి తరగతి గదులను చీపురు పట్టి శుభ్రం చేయడంతో పారిశుధ్య కార్మికులు, అధికారులు విస్తుపోయారు. మంగళవారం ఉదయం ఆ పాఠశాలకు వెళ్లిన సుందరి తరగతి గదులకు కొత్తగా ఫుట్‌మేట్స్ పంపిణీ చేశారు. ఆ సందర్భంగా తరగతి గదుల్లో దుమ్ము, ధూళి కొట్టుకుపోయి ఉండటంతో వాటిని శుభ్రపరిచేందుకు కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులను పిలిపించారు. వారు రావటానికి ఆలస్యం కావటంతో సుందరి తానే చేత చీపురు పట్టి తరగతి గదులను, అల్మారాలను శుభ్రం చేశారు. అరగంట తర్వాత పరికరాలతో వచ్చిన పారిశుధ్య కార్మికులు మేయర్ అప్పటికే అన్ని తరగతి గదులను శుభ్రం చేసినట్లు తెలుసుకుని విస్తుపోయారు. ఇకపై కార్పొరేషన్ పాఠశాల గదులు శుభ్రంగా లేకుంటే పారిశుధ్య కార్మికులపై చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు.



పాఠశాల గదిని శుభ్రం చేస్తున్న కడలూరు మేయర్ సుందరి రాజా

27న స్థలశయన పెరుమాళ్ ఆలయ తిరుమంజనం

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలో ఉన్న స్థలశయన పెరుమాళ్ ఆలయ తిరుమంజనం ఈ నెల 27వ తేది జరుగనుంది. వైష్ణవ ఆళ్వార్లచే మంగళాశాసనం పొందిన 108 వైష్ణవ క్షేత్రాల్లో ఈ ఆలయం 63వది. పురటాసి మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21వ తేది పురటాసి మొదటి శనివారం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతుండగా, ముఖ్య ఘట్టమైన తిరుమంజనం శుక్రవారం జరుగనుంది. నిలమంగై తాయారుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవమూర్తికి తేనె, పాలు, పెరుగు, నారికేళజలాలు, చందన అభిషేకాలు జరుగుతాయి. ఈ తిరుమంజనంకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఫోర్డ్ సంస్థకు గ్రీన్ సిగ్నల్

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: ఫోర్డ్ సంస్థకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సంస్థ విజ్ఞప్తి మేరకు మరమలైనగర్‌లో ఉన్న కర్మాగారాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వంతో పాటు రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ కర్మాగారం నిర్వహణ గడువు మార్చితో ముగిసింది. రెన్యువల్ కోసం కాలుష్య నియంత్రణ బోర్డు వద్ద సంస్థ దరఖాస్తు చేసుకుంది. దీనిని పరిశీలించిన కాలుష్య నియంత్రణ బోర్డు 2028 మార్చి 31వ తేది వరకు గడువు పొడిగిస్తూ అనుమతులిచ్చింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **న్యూ వాషర్‌మెన్‌పేట:** నార్త్ టెర్మినల్ రోడ్డు, టీహెచ్ రోడ్డు, డిడీర్ నగర్, చెరియన్ నగర్, సుడలైముత్తు నగర్, అశోక్ నగర్, దేశీయన్ నగర్, నమ్మయ్య మేస్త్రి వీధి, బుచ్చమ్మాళ్ వీధి, నాగూరాం వీధి, బాలకృష్ణ వీధి, ఫిషింగ్ హార్బర్, ధనపాల్ నగర్, వెంకటేశన్ అలి వీధి, వీరరాఘవన్ వీధి, ఇరుసప్ప మేస్త్రి వీధి, పూండి తంగమ్మాళ్ వీధి, ఏత ఆలయ వీధి, ఆవూర్ ముత్తయ్య వీధి, ఓ వట్టవాడై వీధి, గాంధీ వీధి, వరదరాజన్ వీధి, మేట్టు వీధి, గ్రామ వీధి, క్రాస్ రోడ్డు, శివన్ నగర్, మంగమ్మాళ్ గార్డన్, జీవా నగర్, ఎంపీటీ క్వార్టర్స్. **కోయంబేడు:** శ్రీనివాస్ నగర్, భక్తవత్సలం వీధి, సేమాత్తమ్మన్ నగర్, పీహెచ్ రోడ్డు, మేట్టుకుళం, న్యూ కాలని, తిరువీధిఅమ్మన్ ఆలయ వీధి, కోయంబేడు, చిన్మయా నగర్, కోయంబేడు మార్కెట్, ఆళ్వార్‌తిరు నగర్, రెడ్‌హిల్స్, మూకాంబిగై నగర్, అళగాత్తమ్మన్ నగర్, కృష్ణా నగర్, భువనేశ్వరి నగర్. **విల్లివాక్కం:** సిడ్కో నగర్ 1 నుంచి 10 బ్లాకులు, అమ్మన్‌కుట్టై వీధి, నెహ్రూ నగర్, సిడ్కో ఎస్టేట్, తిరునగర్, విల్లివాక్కం ఏరియా, బాబా నగర్, రాజమంగళం మెయిన్ రోడ్డు, నార్త్, సౌత్ జగన్నాథన్ నగర్, సౌత్ హైకోర్టు ఉద్యోగుల కాలని.

క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న అన్నాడీఎంకే సెక్రటరీ అప్పు

వేలూరు, సెప్టెంబరు 24: స్థానిక లారినా ఇంటర్నేషనల్ పాఠశాలలో 2024-25 వార్షిక క్రీడాపోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నాడీఎంకే మా నగర్ జిల్లా కార్యదర్శి ఎస్సార్కే అప్పు పాల్గొని పోటీలు ప్రారంభించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపినాథ్, ప్రిన్సిపాల్ మీనాంబికై, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలాం స్మారక కేంద్రం కోసం స్థలం

● ఆర్డినెన్స్‌కు హైకోర్టు స్టే

పెరంబూర్, సెప్టెంబరు 24: రామనాథపురం జిల్లా పేకరుంబులో అబ్దుల్ కలాం స్మారక కేంద్రం కోసం స్థలం కేటాయించే ఆర్డినెన్స్‌కు హైకోర్టు మదురై బెంచ్ తాత్కాలిక స్టే విధించింది. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్మారక కేంద్రం ఏర్పాటుకు 2016లో స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. ఈ ఆర్డినెన్స్ వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజావ్యాజ్యంలో... మాడసామి ఆలయం, తెప్పకుళం, సునామీ నివాసం, కమ్యూనిటీ హాలు తదితరాలు కలుపుతూ ఆర్డినెన్స్ జారీచేశారన్నారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, ఆర్డినెన్స్‌కు తాత్కాలిక స్టే విధించడంతో పాటు, ఈ విషయమై అఫిడవిట్ దాఖలుచేయాలని రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్‌కు నోటీసు జారీచేసింది.

రాష్ట్రంలో విషజ్వరాల ప్రభావం లేదు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, సెప్టెంబరు 24: రాష్ట్రంలో ఎలాంటి విషజ్వరాల వ్యాప్తి ప్రస్తుతం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. చిన్నపోరూరులోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో 9 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1,480 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ... ప్రస్తుతం డెంగ్యూ వ్యాప్తి నియంత్రణలో ఉందన్నారు. కేరళ-తమిళనాడుల్లోని 17 సరిహద్దు ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆ రాష్ట్రం నుంచి వచ్చే వారికి థర్మల్ స్కాన్ చేయడంతో పాటు వాహనాలకు మందు పిచికారీ అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నామని తెలిపారు. అలాగే, ఎంపాక్స్ బాధితులకు చికిత్స అందించేలా రాష్ట్రంలోని పలు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎలాంటి విషజ్వరాల ప్రభావం లేదన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తమ తమ ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తనయుడి పట్టాభిషేకం కోసం తపిస్తున్న స్టాలిన్

● మాజీ మంత్రి డి.జయకుమార్

ప్యారీస్, సెప్టెంబరు 24: తనయుడు, మంత్రి ఉదయనిధి పట్టాభిషేకం కోసమే ముఖ్యమంత్రి స్టాలిన్ తపిస్తున్నారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... సముద్రంలో చేపల వేటకు వెళుతున్న రాష్ట్ర జాలర్లు శ్రీలంక నేవీ దాడులకు గురై తీవ్రంగా నష్టపోతున్నారని, అయితే దానిని అడ్డుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపలేదని ఆరోపించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి రూ.80 కోట్లతో కలం స్మారక చిహ్నం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన ప్రభుత్వం, ఆయన పేరుతో పేదలకు పథకాల పేరుతో సహాయాలు అందించవచ్చు కదా అని జయకుమార్ ప్రశ్నించారు.

ఇసుక లారీ బోల్తా: ముగ్గురి అరెస్ట్

పాలసముద్రం, సెప్టెంబరు 24: ఓ ఇసుక లారీ బోల్తా పడింది. పోలీసుల విచారణలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తేలింది. దీంతో ప్రధాన సూత్రధారుడితోపాటు లారీ డ్రైవర్, క్లీనర్‌ని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగధరనెల్లూరు మండలం తూగుంద్రం నుంచి తమిళనాడుకు 16 చక్రాల లారీలో ఇసుకను లోడ్ చేసుకుని పాలసముద్రం మీదుగా చెన్నైకి తీసుకెళుతున్నారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు పాలసముద్రం మండలంలోని కన్యకాపురం వద్ద ఆ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ భారతి, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డికి చెందిన ఈ లారీ ద్వారా ఇసుకను చెన్నైకి గంగాధర నెల్లూరు మండలం కొత్తవెంకటాపురానికి చెందిన సుధాకర్ నాయుడు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ప్రధాన సూత్రధారుడైన సుధాకర్ నాయుడిని, లారీ డ్రైవర్ పవన్ (27), క్లీనర్ విజయ్ (21)లను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలకు సెలవు రోజులు పెంచాలి

పెరంబూర్, సెప్టెంబరు 24: పాఠశాలల త్రైమాసిక సెలవులు అక్టోబరు 7వ తేది వరకు పెంచాలని ఉపాధ్యాయుల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం త్రైమాసిక పరీక్షలు జరుగుతుండగా, ఈ నెల 27తో ముగియనున్నాయి. అనంతరం 28 నుంచి అక్టోబరు 2వ తేది వరకు ఐదు రోజులకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కాగా, ఈ ఐదు రోజుల సెలవుల్లో శని, ఆదివారం, గాంధీ జయంతి ప్రభుత్వ సెలవులు కాగా, రెండు రోజులు మాత్రమే సాధారణ సెలవులున్నాయి. దీంతో, అక్టోబరు 2వ తేది గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సెలవు దినం కావడం, గురు, శుక్రవారాలు పనిదినాలు కాగా, తర్వాత శని, ఆదివారాలు సెలవులు రానున్నాయి. దీంతో, గురు, శుక్రవారాలు కూడా సెలవులు ప్రకటించి, త్రైమాసిక పరీక్షలు 9 రోజులుగా ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు పాఠశాల విద్యాశాఖకు విజ్ఞప్తి చేస్తున్నాయి.

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా ఎస్.అల్లి

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా న్యాయాధికారి, చెన్నై సిటీ సివిల్ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి ఎస్.అల్లి నియమితులయ్యారు. అదే విధంగా హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్)గా జిల్లా జడ్జి జె.సెల్వనాథన్, హైకోర్టు మదురై బెంచ్ రిజిస్ట్రార్ (జుడీషియల్)గా నీలగిరి జిల్లా జడ్జి ఎ.అబ్దుల్ ఖాదర్, హైకోర్టు మదురై బెంచ్ అడిషనల్ రిజిస్ట్రార్-2 (విజిలెన్స్)గా జిల్లా జడ్జి జి.శ్రీరామజయం నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కోలుకున్న దురై దయానిధి



ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న దురై దయానిధి

వేలూరు, సెప్టెంబరు 24: స్థానిక సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దురై దయానిధి మంగళవారం డిశ్చార్జి అయ్యారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు, మాజీ కేంద్ర మంత్రి ఎంకే అళగిరి కుమారుడు దురై దయానిధి మార్చి 14వ తేది అనారోగ్యంతో సీఎంసీ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దురై దయానిధిని మే 8వ తేది సీఎం స్టాలిన్ పరామర్శించారు. ఈ క్రమంలో, పూర్తిగా కోలుకున్న దురై దయానిధి మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

ఊరీసు కళాశాలలో 'నాన్ ముదల్‌వన్' ప్రారంభం



పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 24: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఊరీసు కళాశాలలో 'నాన్ ముదల్వన్' పథకం ప్రారంభించారు. ప్లస్ టూ ఉత్తీర్ణులై ఉన్నత విద్యలో చేరని విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులను గుర్తించి వారికి వృత్తి శిక్షణ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఊరీసు కళాశాలలో ఈ పథకాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్‌కుమార్, కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ మలర్, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, జిల్లా ఆదిద్రావిడ సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, ప్రధాన విద్యాధికారి మణిమొళి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ సమస్య.... నటి త్రిష కేసు ముక్తాయింపు

ప్యారీస్, సెప్టెంబరు 24: ప్రహరీ గోడ వ్యవహారంలో పక్కింటి వారితో ఏర్పడిన సమస్యలో రాజీకొచ్చినట్లు హామీ ఇవ్వడంతో ప్రముఖ నటి త్రిష దాఖలుచేసిన కేసుకు మద్రాసు హైకోర్టు ముక్తాయింపు పలికింది. స్థానిక సెంటాఫ్ రోడ్డులో నివసిస్తున్న నటి త్రిష తమ ఇంటి భవనానికి నష్టం కలిగేలా ప్రహరీ గోడ కూల్చివేసేందుకు పక్కింటికి చెందిన మెయ్యప్పన్ చేపట్టిన ప్రయత్నాలపై స్టే విధించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు న్యాయమూర్తి టీకారామన్ సమక్షంలో మంగళవారం విచారణకు రాగా, విభేదాలు ఎదుర్కొంటున్న ఇరువర్గాలు హాజరయ్యారు. పక్కింటి వారితో రాజీ కుదుర్చుకున్నట్లు నటి త్రిష హామీ పత్రం దాఖలుచేశారు. దీంతో కేసు కోసం నటి త్రిష కోర్టుకు చెల్లించిన ఫీజు తిరిగి అప్పగించాలని రిజిస్ట్రార్‌కు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

పుదువై హోంశాఖ మంత్రికి అస్వస్థత



మంత్రి నమశ్శివాయం

పుదుచ్చేరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి హోం శాఖ మంత్రి నమశ్శివాయం అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. పుదుచ్చేరిలో రోజురోజుకు విషజ్వరాలు వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో, సోమవారం జ్వరం బారినపడిన మంత్రి నమశ్శివాయంను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు చికిత్సలందిస్తున్న వైద్యుల బృందం, మంగళవారం కూడా జ్వరం తగ్గేందుకు మందులు వాడుతున్నామని, మంత్రి నమశ్శివాయం ఒకటి, రెండు రోజుల్లోనే ఈ సమస్య నుంచి కోలుకుంటారని పేర్కొన్నాయి. కాగా మంత్రి అనారోగ్యం గురించి తెలుసుకున్న వందలాదిమంది కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకోవడంతో, ఆయన అనుచరులు వారిని వెనక్కి తిప్పి పంపించారు.

ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి

● మంత్రి దురైమురుగన్‌కు నిరాశ మిగిల్చిన సీఎం

● బీజేపీ నేత తమిళిసై విమర్శ

ప్యారీస్, సెప్టెంబరు 24: ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే మంత్రివర్గంలో చేపట్టనున్న మార్పులు మంత్రి ఉదయనిధికి సంతోషం కలిగించే విధంగా, సీనియర్ మంత్రి దురైమురుగన్‌కు నిరాశ మిగిల్చేలా ఉంటుందని బీజేపీ సీనియర్ నేత డా.తమిళిసై సౌందర్‌రాజన్ విమర్శించారు. ఆమె నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం సరైన మార్గంలో వెళ్తుందో, లేదో కూడా స్పష్టత లేదని, ప్రజలకు లబ్ధిచేకూర్చే పథకాల కన్నా ఎన్‌కౌంటర్లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ మూడేళ్ల పాలనలో 17 ఎన్‌కౌంటర్లు జరగడం దిగ్భ్రాంతికి గురిచేసిందని, అసలు నేరస్తులను రక్షించేందుకే ఈ సంస్కృతి కొనసాగుతుందన్నారు. త్వరలో జరుగబోయే మంత్రివర్గం మార్పులో ఉదయనిధి కంటే సీనియర్లు, అనుభవజ్ఞులకు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టే అవకాశం లేదని తమిళిసై వ్యాఖ్యానించారు.

బీజేపీ నేత హెచ్.రాజా సుడిగాలి పర్యటన

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: బీజేపీ రాష్ట్ర సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా రాష్ట్రవ్యాప్త పర్యటన మంగళవారం ప్రారంభమైందని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీలో కొత్త సభ్యుల చేరిక, పార్టీ శాఖల పనితీరు, బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యేలా చేపట్టిన ఈ యాత్ర చెంగల్పట్టు దక్షిణ జిల్లాలో ప్రారంభమైంది. బుధవారం దక్షిణ చెన్నై, 26న కాంచీపురం, 27న ఉత్తర చెన్నైలో రాజా పర్యటించనున్నారు. అనంతరం తిరుచ్చి, పుదుకోట, మదురై, తేని, దిండుగల్, కన్నియాకుమారి సహా పార్టీ నిర్వహణకు ఏర్పాటుచేసిన 65 జిల్లాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టనున్నారు. అక్టోబరు 17న నీలగిరిలో ఆయన పర్యటన ముగుస్తుందని పార్టీ తెలియజేసింది.

వాణిజ్య కాంప్లెక్స్‌కు సీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: తాగునీటి పన్ను రూ.90 వేలు చెల్లించని వాణిజ్య కాంప్లెక్స్‌కు అధికారులు సీలు వేశారు. తిరువిక నగర్ మండల పరిధిలోని కొళత్తూర్ తిల్లైనగర్‌లో ఉన్న వాణిజ్య కాంప్లెక్స్‌లో టైల్స్, పెయింట్స్ దుకాణాలు, పాత కార్ల విక్రయ షోరూం వంటివి పనిచేస్తున్నాయి. కాంప్లెక్స్ యజమానులు తాగు, మురుగునీటి పన్ను రూ.90,000 చెల్లించకుండా బకాయిలుంచారు. దీనికి సంబంధించి అధికారులు నోటీసులు పంపినా నిర్లక్ష్యంగా ఉండడంతో, సోమవారం తహసీల్దార్ భవాని నేతృత్వంలో అధికారులు కాంప్లెక్స్‌కు సీలు వేశారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 24: మైక్ సెట్ ఏర్పాటుచేస్తున్న బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. అరన్‌వాయల్ ప్రాంతంలోని ఓ హాలులో జరిగే శుభకార్యానికి మైక్ సెట్ అమర్చుతున్నారు. ఈ పనులు చేస్తున్న యువకుడికి సాయం చేసేందుకు దీన (13) అనే బాలుడు వచ్చాడు. మైక్ సెట్ ఏర్పాటుచేస్తున్న సమయంలో దీన హఠాత్తుగా విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నో పార్కింగ్ బోర్డులుంచరాదు

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: నగరంలో రాకపోకలకు అంతరాయం కలిగించేలా నో పార్కింగ్ బోర్డులు ఉంచరాదని గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... అధికారుల అనుమతి లేకుండా గృహాలు, దుకాణాలు ముందు నో పార్కింగ్ బోర్డులు, మట్టితో నింపిన సంచులు, బారికేడ్లు ఏర్పాటు చేయడం ఇటీవల పెరిగిందని, దీని ద్వారా ప్రజలకు, వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుందని పేర్కొంది. వీటిని ఏర్పాటుచేసే ముందు అధికారుల అనుమతి పొందాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు పోలీసు శాఖ హెచ్చరించింది.

కల్తీ సారా వ్యవహారం ... కమిషన్ గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 24: కళ్లకుర్చి కల్తీ సారా తాగి సుమారు 60కి మందికి పైగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం విచారించేందుకు మాజీ న్యాయమూర్తి పి.గోకుల్‌దాస్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ఈ కమిటీ విచారణకు మరో మూడు నెలలు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సేలం జిల్లా కలెక్టర్‌కు 'వారెంట్'

పెరంబూర్, సెప్టెంబరు 24: సేలం జిల్లా కలెక్టర్‌కు న్యాయస్థానం వారెంట్ జారీ చేసింది. సేలం జిల్లా మేట్టూరు తాలూకా సెంగరడు గ్రామానికి చెందిన మూర్తి, సందియూర్ అట్టయాంపట్టి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. పంచాయతి నిధులు దుర్వినియోగం చేసినట్లు మూర్తిపై ఆరోపణలు రావడంతో, ఆయనను సస్పెండ్ చేస్తూ 2017 ఆగస్టులో సేలం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. దానిని వ్యతిరేకిస్తూ మూర్తి దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ విచారించిన హైకోర్టు, 16 వారాల్లో మళ్లీ మూర్తిని విధుల్లోకి తీసుకోవాలని గత ఏడాది సెప్టెంబరులో ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు అమలుచేయలేదంటూ సేలం జిల్లా కలెక్టర్‌పై మూర్తి పిటిషన్ చేశారు. ఈ కేసు ఇటీవల విచారించిన న్యాయమూర్తి దేవానంద్, తదుపరి విచారణకు కలెక్టర్ హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసు విచారణ సోమవారం జరుగగా, కలెక్టర్ హాజరుకాలేదు. దీంతో, కలెక్టర్‌కు వారెంట్ జారీచేసిన న్యాయమూర్తి, తదుపరి విచారణ అక్టోబరు 1వ తేదీకి వాయిదావేశారు.

పూందమల్లి జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పూందమల్లి జైలులో ఓ ఖైదీ బ్లేడు ముక్కలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 2011లో బీజేపీ జాతీయ నేత అద్వానీ రథయాత్ర చేస్తూ మదురై వచ్చినప్పుడు ఆయన వెళ్లే మార్గంలో పైప్ బాంబు పేలింది. ఆ సంఘటనకు సంబంధించి జాకీర్‌హుసేన్ (37)ను రెండేళ్ల క్రితం అరెస్టు పుళల్ జైలుకు తరలించారు. ఆ తర్వాత భద్రతా కారణాల దృష్ట్యా అతడిని పూందమల్లి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న జాకీర్ హుసేన్ బ్లేడు ముక్కలను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని చికిత్స కోసం స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సకు సహకరించకుండా అతడు వార్డు గదిలోని ట్యూబ్‌లైట్లను పగులగొట్టి రభస చేశాడు. వైద్యులు అతికష్టం మీద అతడికి చికిత్సలందించారు. మూడు రోజుల చికిత్సం తర్వాత అతడిని పూందమల్లి జైలుకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం వైద్యపరీక్షల కోసం అతడిని భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. జాకీర్ హుసేన్‌కు ఆరు నెలల క్రితం ముందు మద్రాసు హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. అయితే బెయిలు షరతుల ప్రకారం నగదు పూచీకత్తు, ఇతర ఆధారాలను సమర్పించకపోవడంతో జైలు నుంచి విడుదల కాలేకపోయాడు. ఈ నేపథ్యంలోనే జీవితంపై విరక్తి చెంది అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

అన్నాడీఎంకే నేత ఇంటిపై బాంబు దాడి



ఇంటి ముంగిట పడి ఉన్న బాంబు ముక్కలు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా చిన్నమనూరు అన్నాడీఎంకే నగర శాఖ కార్యదర్శి పిచ్చైకని ఇంటిపై మంగళవారం వేకువజాము గుర్తు తెలియని వ్యక్తులు పెట్రో బాంబులతో దాడి జరిపారు. చిన్నమనూరు-కుమిళి రహదారిలో పిచ్చైకని ఇల్లు,దాని పక్కనేపార్టీ కార్యాలయం ఉన్నాయి. వేకువజాము రెండుగంటల ప్రాంతంలో బైకుల్లో వచ్చిన వ్యక్తులు పెట్రోల్ బాంబులు విసిరి పారిపోయారు. ఆ బాంబులు పేలి గేటుకు నిప్పంటుకుంది. ఆ లోగా ఇంటిలోని వారంతా బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

రౌడీ తిరుచ్చి సురేష్ అనుచరుల అరెస్టు

ప్యారీస్, సెప్టెంబరు 24: తిరుచ్చి, పుదుకోట జిల్లాల్లో కట్ట పంచాయతీల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడిన తిరుచ్చి రౌడీ సురేష్ అనుచరులు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచ్చి ఎస్పీ కార్యాలయానికి చెందిన 825 మంది పోలీసులు ఒకే సమయంలో పలు బృందాలుగా ఏర్పడి ఈ రెండు జిల్లాల్లో ఈ నెల 19వ తేది నుంచి తనిఖీలు చేస్తున్నారు. పోలీసుల కళ్లుగప్పి పరారైన తిరుచ్చి సురేష్ అనుచరులు ఇద్దరిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి నుంచి పలువురి వద్ద దోచుకున్న బ్యాంక్ పాస్ పుస్తకాలు, ప్రామిసరీ నోట్లు, 18 సెల్‌ఫోన్లు, 84 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

రౌడీ సీడీ మణి కాలికి గాయాలు...

పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకునే ప్రయత్నంలో జారిపడిన రౌడీషీటర్ సీడీ మణి కాలికి గాయాలయ్యాయి. తేనాంపేటకు చెందిన మణిపై అడయార్, సైదాపేట తదితర పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రౌడీ మణి సేలంలో తలదాచుకున్నాడనే సమాచారంతో అక్కడికెళ్లి ఇటీవల అరెస్ట్ చేశారు. పుళల్ జైలు నుంచి ఓ కేసు విచారణ నిమిత్తం సోమవారం సీడీ మణిని పోలీసులు తీసుకెళ్తున్న సమయంలో వారి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించడంతో మణి కాలికి గాయాలయ్యాయి. దీంతో అతన్ని ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు.

బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

ఐసిఎఫ్, సెప్టెంబరు 24: నాగపట్టణం సమీపం గురుకత్తి బైపాస్ రోడ్డులో ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ప్లస్ వన్ విద్యార్థిని మృతిచెందింది. ఐదవ తరగతి చదువుతున్న తమ్ముడు అవినాష్‌ను అశ్విని స్కూటర్‌పై పాఠశాలకు తీసుకెళ్లే సమయంలో ఈఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన అవినాష్‌ను ఆస్పత్రికి తరలించిన పోలీసులు, అశ్విని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

చిత్రజ్యోతి

ఈ శుక్రవారం విడుదలయ్యే చిత్రాలెన్ని?





విడుదలకు సిద్ధంగా ఉన్న ఆరు చిత్రాలు

చిత్రపరిశ్రమకు ప్రతి శుక్రవారం ప్రత్యేకం. దీనికి కారణంగా, కొత్త సినిమాలు విడుదలయ్యే రోజు కావడంతో ఇండస్ట్రీలో పండుగ వాతావరణం నెలకొంటుంది. సెప్టెంబరు నెల చివరి శుక్రవారమైన ఈ నెల 27వ తేదీన మొత్తం ఆరు చిత్రాలు విడుదలకానున్నాయి. వీటిలో ఒకటి డబ్బింగ్ చిత్రం. మిగిలిన ఐదు చిత్రాలు స్ట్రైట్ చిత్రాలు. ఇందులో ప్రధానంగా కార్తీ, అరవింద్ స్వామి నటించిన 'మెయ్యళగన్' ఒకటి. ఇది కార్తీ నటించిన 27వ చిత్రం. ప్రేమ్ కుమార్ దర్శకుడు. సూర్య - జ్యోతిక దంపతులు 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై నిర్మించారు. విజయ్ ఆంటోనీ నటించిన 'హిట్లర్'. ధనా దర్శకుడు. రియా సుమన్ హీరోయిన్. ఎస్‌జే శీను దర్శకత్వంలో ప్రభుదేవా, వేదిక జంటగా నటించిన 'పేట రాప్'. బాలీవుడ్ నటి సన్నీలియోన్ ఒక ప్రత్యేక గీతంలో నృత్యం చేశారు. సతీష్, అజయ్ రాజ్, పావెల్ నవగీతన్, షైమ్ గోపి, రితిక, కేపీవై సతీష్, విద్య ప్రదీప్, భవ చెల్లదురై, రాందాస్, అజయ్ దేశా నటించిన 'చట్టం ఎన్ కైయిల్' చిత్రానికి చాచి దర్శకుడు. భరద్వాజ్ మురళీకృష్ణ, ఆనంద్‌కృష్ణన్ షణ్ముగం, శ్రీరాం సత్యనారాయణన్ సంయుక్తంగా నిర్మించారు. మరో చిన్నబడ్జెట్ చిత్రం 'దిల్ రాజా'. విజయ్ సత్య, షెరిన్, సంయుక్త, వనీత తదితరులు నటించిన ఈ సినిమాకు ఏ.వెంకటేష్ దర్శకత్వం వహించగా కోవై బాలసుబ్రమణ్యం నిర్మించారు. చివరగా కొరటాల శివ దర్శకత్వంలో టాలీవుడ్ అగ్ర హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' పాన్ ఇండియా మూవీగా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతం. వీటిలో 'మెయ్యళగన్', 'హిట్లర్'లపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొనివున్నాయి.



'టాక్సిక్ కాదల్'లో అరుణ్ రాజ్

అరుణ్ రాజ్ సంగీతంలో 'టాక్సిక్ కాదల్' ఆల్బమ్

కోలీవుడ్‌లో పేరున్న సంగీత స్వరకర్తల్లో ఒకరిగా గుర్తింపుపొందిన అరుణ్ రాజ్ శ్రోతల హృదయాలను కదిలించే ఎన్నో పాటలను కంపోజింగ్ చేసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. తాజాగా ఆయన 'టాక్సిక్ కాదల్' పేరుతో మరో ఇండిపెండెంట్ ఆల్బమ్ రూపొందించి, బిగ్‌బాస్ ఫేం అర్చన రవిచంద్రన్‌తో కలిసి విడుదల చేశారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ పాట.. ఎమోషనల్, మెలోడీ, బోల్డ్ లిరిక్స్ కలయికతో ఆధునిక శృంగార సంబంధాలపై సాగుతుంది. ఈ ఆల్బమ్ విడుదలై అరుణ్ రాజ్ మాట్లాడుతూ, ఈ ఆల్బమ్ నా హృదయానికి చాలా దగ్గరైన పాట. ఈ పాటలోని భావాలు చాలా సహజంగా, వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ పాటకోసం అర్చనతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభవం' అని పేర్కొన్నారు. కాగా, ఈ మ్యూజిక్ ఆల్బమ్‌ను టిప్స్ మ్యూజిక్ కంపెనీ రూపొందించగా, ప్రస్తుతం అన్ని ప్రధాన మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో అందుబాటులో ఉంది.

సముద్రకని ప్రధాన పాత్రలో 'తిరు.మాణిక్యం'



'తిరు.మాణిక్యం'లో ఓ దృశ్యం

జీపీఆర్‌కే సినిమాస్ పతాకంపై సముద్రకని ప్రధాన పాత్రలో నంద పెరియస్వామి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తిరు.మాణిక్యం'. త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానున్న ఈ చిత్రం డిజిటల్, శాటిలైట్ హక్కులను జీ సంస్థ కైవసం చేసుకుంది. సముద్రఖని, భారతీరాజా, అనన్య, నాజర్, తంబి రామయ్య, ఇళవరసు, శ్రీమాన్, వడివుక్కరసి, కరుణాకరన్, శామ్స్ తదితరులు నటించారు. 'సీతా రామం' ఫేం విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు. రేఖ రవికుమార్ జిందా గోపాలకృష్ణా రెడ్డి, రాజా సెంథిల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా శాటిలైట్, డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకుని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు వినోదాన్ని అందించేందుకు జీ సంస్థ సిద్ధమైంది.



స్టూడియో ప్రారంభోత్సవంలో మణిరత్నం - రెహ్మాన్

ఏఆర్‌ఆర్ ఫిల్మ్ సిటీలో యూస్ట్రీమ్ స్టూడియో

చెన్నైలోని ఏఆర్‌ఆర్ ఫిల్మ్ సిటీలో 'యూస్ట్రీమ్' పేరుతో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ వర్చువల్ ప్రొడక్షన్ స్టూడియోను ప్రముఖ సంగీత దర్శకుడు, అకాడెమీ అవార్డు గ్రహీత ఏఆర్.రెహ్మాన్ నెలకొల్పారు. దీన్ని దర్శక దిగ్గజం మణిరత్నం ప్రారంభించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో 500 మందికిపైగా సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ స్టూడియో భారతీయ చిత్రపరిశ్రమలో ఫిల్మ్ మేకింగ్, కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్.రెహ్మాన్ మాట్లాడుతూ, 'యూస్ట్రీమ్ అనేది కళ, సాంకేతిక అత్యున్నత స్థాయిలో కలిసే ప్రదేశం.భారతీయ కథలను ప్రపంచం ప్రేక్షకులకు అందించే ప్రదేశం. యూస్ట్రీమ్ భారతీయ కథలను ప్రపంచ ప్రేక్షకులకు అందించగలదు.ఇది సాంకేతికతను మాత్రమే కాకుండా, నిర్మాతలు, దర్శకులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.అద్భుతమైన లెడ్ స్క్రీన్ సిస్టమ్‌తో కూడిన ఈస్టూడియోలో కళాకారులు తాము ఊహించిన వాటిని తమ కళ్లముందు కంప్యూటర్ విజువలైజేషన్‌తో దృశ్యమానం చేయొచ్చన్నారు.

పెద్ద హీరోల సినిమాలు 8 వారాల తర్వాతే ఓటీటీకి

● థియేటర్ యజమానుల సంఘం సూచన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న థియేటర్ యజమానుల సంఘ నాయకులు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హీరోలు నటించిన చిత్రాలను విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని రాష్ట్ర థియేటర్ యజమానుల సంఘం నిర్మాతలకు సూచించింది. మంగళవారం ఉదయం తేనాంపేటలోని ఆ సంఘం కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ఆర్.పన్నీర్ సెల్వం అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. గతంలో నిర్మాత సంఘం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు పెద్ద హీరోల చిత్రాలను ఎనిమిది వారాల తర్వాత, తక్కిన చిత్రాలను ఆరు వారాల తర్వాత ఓటీటీలో విడుదల చేయాలని నిర్మాతలకు విజ్ఞప్తి చేశారు. తమిళ సినిమాలను దేశమంతటా ఒకే సమయంలో విడుదల చేయాలని, కొన్ని రాష్ట్రాల్లో ముందుగా విడుదల చేసే ఆనవాయితీకి స్వస్తి చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాలలో 24 గంటలపాటు సినిమాలను ప్రదర్శిస్తున్నారని, అదే విధంగా రాష్ట్రంలోనూ 24 గంటలపాటు సినిమాలను ప్రదర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వాలని కోరారు. ప్రవేశ రుసుములో 10శాతం థియేటర్ల మెయింటెనెన్స్ ఛార్జీ వసూలు చేసుకునేందుకు అనుమతించాలన్నారు. మాల్స్‌లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతించినట్లే థియేటర్లలో వాణిజ్య కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వాలని ఈ సంఘం నిర్వాహకులు కోరారు.

పళని పంచామృతంలో కల్తీ అంటూ వ్యాఖ్యలు

● సినీ దర్శకుడి మోహన్ అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 24: దిండుగల్ జిల్లా పళని దివ్యక్షేత్రంలో తయారుచేసే పంచామృతం కల్తీ జరిగిందనే అసత్య ఆరోపణలు చేసిన తమిళ సినీ దర్శకుడు జి.మోహన్‌ను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న వ్యవహారం ఇంకా సద్దుమణగక ముందే పళని పంచామృతం గురించి జి.మోహన్ అసత్య ఆరోపణలు చేశారంటూ తిరుచ్చి పోలీసులకు సుబ్రమణ్యస్వామి భక్తులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పళని పంచామృతంలో గర్భనిరోధక మాత్రలు కలిపి భక్తులకు వినియోగించారంటూ మాట్లాడిన మోహన్‌ను మంగళవారం ఉదయం వాషర్‌మెన్‌పేటలోని ఆయన ఇంటిలో అరెస్ట్ చేసి విచారణ నిమిత్తం తిరుచ్చికి తీసుకెళ్లారు.



ఫెర్నాండో అలోన్స్‌తో కాగ్నిజెంట్ ఉద్యోగులు

కాగ్నిజెంట్‌లో ఫెర్నాండో ఆలోన్స్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని కాగ్నిజెంట్ - ఆస్టన్ మార్టిన్ అరామ్‌కో ఫార్ములా వన్ టీం మంగళవారం మూడు సంవత్సరాల భాగస్వామ్య విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఆస్టన్ మార్టిన్ అరామ్‌కో డ్రైవర్, రెండుసార్లు ఫార్ములా వన్ వరల్డ్ ఛాంపియన్ ఫెర్నాండో అలోన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో కాగ్నిజెంట్ ఉద్యోగుల ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఈ సందర్భంగా ఫెర్నాండో అలోన్స్ మాట్లాడుతూ.. భారత్‌లో కాగ్నిజెంట్ కుటుంబాన్ని సందర్శించడం చాలా సంతోషంగా వుందని పేర్కొన్నారు. భారత్‌లో అడుగు పెట్టడం ఎప్పుడూ కొత్తగా వుంటుందని పేర్కొన్నారు.

'ప్యాటర్సన్ క్యాన్సర్' కేంద్రంలో ఘనంగా రోజ్ డే



కార్యక్రమంలో ప్రముఖులు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన 'ప్యాటర్సన్ క్యాన్సర్ సెంటర్‌'లో ఇటీవల 23వ రోజ్ డే ఘనంగా జరిగింది. ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా దివంగత ఎంఎస్ విశ్వనాథన్ కుమార్తె లతా మోహన్, కలైమామణి శ్రీ, సంగీత దర్శకుడు దీనా, విజయ్ నర్సింగ్ హోం ఎండీ డాక్టర్ కుమారవేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం హాస్పిటల్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ కృష్ణన్ క్యాన్సర్ ఎలా వస్తుందో వివరిస్తూ.. దానిని సమూలంగా తొలగించలేమన్నారు. అందువల్ల దానిని ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే అది బాధితులను కాపాడుతుందన్నారు. ఇటీవల తాము నిర్వహించిన క్యాన్సర్ అవగాహనా శిబిరంలో 203 మంది పాల్గొనగా, అందులో 16 మందికి క్యాన్సర్ సోకినట్లు తేలిందన్నారు.



పట్టాలు అందుకున్న విద్యార్థులతో గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రి పొన్ముడి తదితరులు

ఘనంగా మద్రాసు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

● విద్యార్థులకు పట్టాలు అందజేసిన గవర్నర్

ప్యారీస్, సెప్టెంబరు 24: ఘనచరిత్ర కలిగిన మద్రాసు విశ్వవిద్యాలయం 166వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్.రవి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి కూడా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకల్లో సుమారు 55,000 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పలు కోర్సులకు సంబంధించి పట్టాలు అందుకున్నారు. ఈ విశ్వవిద్యాలయానికి ఏడాదిన్నర కాలంగా ఉపకులపతిని నియమించకపోవడంతో నిర్వహణ బాధ్యతలను విశ్వవిద్యాలయ సమన్వయ కమిటీ కొనసాగిస్తోంది. గత కొన్ని మాసాలుగా గవర్నర్ రవి, మంత్రి పొన్ముడి ఉన్నత విద్యాసంస్థ తరఫున నిర్వహించిన కార్యక్రమాల్లో కలిసి పాల్గొనలేదు. అయితే, మద్రాసు వర్సిటీ 166వ స్నాతకోత్సవంలో వారిద్దరూ ఒకే వేదికపై కనిపించారు. ముందుగా వేదిక ప్రాంగణానికి విచ్చేసిన గవర్నర్‌కు మంత్రి పొన్ముడి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వినూత్న అణు నిరోధక షీల్డ్ వ్యవస్థ విజయవంతం

● సిగ్మా9 సీఎండీ డా.మిక్కిలి ప్రసన్నకుమార్



విజయోత్సవంలో నిర్వాహకులు ఇందిర, కీర్తి తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 24: సిగ్మా9 ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ రీసెర్చి కేంద్రంలోని శాస్త్రవేత్తలు వినూత్న అణు నిరోధక షీల్డ్ వ్యవస్థను విజయవంతంగా అభివృద్ధి చేశారని ఆ సంస్థ సీఎండీ డాక్టర్ మిక్కిలి ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు పెరియమెట్‌లోని సాల్వేషన్ హాలులో సోమవారం రాత్రి విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. సభాధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... మహిళా సాధికారికతతో తమ సంస్థ యాంటీ న్యూక్లియర్ షీల్డ్ టెక్నాలజీలో అద్భుతమైన పురోగతి సాధించిందన్నారు. దేశ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అణు విపత్తు ప్రమాదాల నుంచి జీవులను రక్షించే లక్ష్యంతో అధునాతన సెన్సార్లు, యాంటీ క్షిపణి గోడలను మిళితం చేస్తుందని వివరించారు. ముఖ్యంగా శత్రు దేశాల అణు దాడులను తట్టుకోగల దృఢమైన రక్షణాత్మక మౌలిక సదుపాయాలు సృష్టించడం ద్వారా పౌరులను రక్షించాలన్న లక్ష్యంతో తాము ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నిర్వాహకులు ఇందిర, కీర్తి, రాధా రాజేశ్వరి, కంచన్, తులసి, రమణి, శ్వేత, నవనీత, వాణి, చరితసౌఖ్య సహా లెఫ్టినెంట్ కల్నల్ అబ్రహాం లింకన్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చివరగా సంస్థ డైరీ ఆవిష్కరించి సభ్యులందరికీ ఐడీ కార్డులు పంపిణీ చేసి అందర్నీ ఘనంగా సన్మానించారు.

అధునాతన పరిజ్ఞానం నూతన పరిశోధనలకు నాంది



సావనీర్ విడుదల చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, సెప్టెంబరు 24: ఆధునిక సాంకేతిక అందుబాటులోకి రావడంతో కొత్త పరిశోధనలకు నాంది పలుకుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వడపళనిలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అభిజ్ఞాన్ 24' పేరిట 13వ జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును డీన్ డా.సీవీ జయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్ అండ్ ప్లేస్‌మెంట్స్) డా.సి.గోమతి, ఈసీఈ డిపార్ట్‌మెంట్ హెడ్ డా.ఎ.షెర్లీ ఎడ్వర్డ్, ఈవెంట్ కో-ఆర్డినేటర్లు డా.పి.నాగరాజన్, డా.వి.కవిత, డా.అంజు తదితరులు పర్యవేక్షించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఓ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ డా.ఎస్.కృష్ణకుమార్ ఎలక్ట్రానిక్స్ రంగంలో జరుగుతున్న పురోభివృద్ధిని వివరించారు.

విమానాశ్రయ ప్రాంగణంలో ద్విచక్రవాహనాలకు నిషేధం

పెరంబూర్, సెప్టెంబరు 24: స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో ద్విచక్రవాహనాలకు హఠాత్తుగా నిషేధం విధించడం కలకలం రేపింది. రాష్ట్రంలో మీనంబాక్కం విమానాశ్రయ ప్రాంగణంలో ద్విచక్రవాహనాలకు నిషేధం విధించారు. దీంతో, ప్రయాణికులతో వచ్చే బంధువులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. మెట్రో రైల్వేస్టేషన్‌లోని పార్కింగ్ స్థలంలో వాహనాలు పెట్టి నడిచి రావాలంటూ ఉద్యోగులు తెలుపడంతో వాహనదారులు వారితో వాగ్వివాదానికి దిగారు.

త్రివేణి సంగమంలో మెట్లకు మరమ్మతులు



మెట్లకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 24: కన్నియాకుమారి సముద్రంలోని త్రివేణి సంగమం ప్రాంతంలోని మెట్లకు మరమ్మతు పను లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాం త మైన కన్నియాకుమారి వచ్చే భక్తులు, త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులు త్రివేణి సంగమంలో దిగే మెట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో, అధికారులు మెట్లకు మరమ్మతులు చేపట్టారు.



తిరుక్కువలై పాఠశాలలో కొత్తగా నిర్మించిన కలైఅరంగం పరిశీలిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

కరుణానిధి చదివిన పాఠశాలకు మంత్రి అన్బిల్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విద్యాభ్యాసం చేసిన నాగపట్టినం జిల్లా తిరుక్కువలై పంచాయతీ యూనియన్ మాధ్యమిక పాఠశాలలో పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ మంగళవారం తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో బడిపిల్లలకు అల్పాహారం అందించే గదిని, తరగతి గదులను, మరుగుదొడ్లను కొత్తగా నిర్మించిన కలైఅరంగంను పరిశీలించారు.

పరందూర్ విమానాశ్రయం ఏర్పాటుపై ఏకనాపురం గ్రామస్తుల ఆక్షేపణ



భూసేకరణ అధికారి కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఏకనాపురం గ్రామస్తులు

పెరంబూర్, సెప్టెంబరు 24: పరందూర్ విమానాశ్రయ ఏర్పాటును విరమించుకోవాలని కోరుతూ ఏకనాపురం గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు.. కాంచీపురం జిల్లా పరందూర్, పరిసర ప్రాంతాల్లోని 20 గ్రామాల్లో సుమారు 5,746 ఎకరాలు సేకరించి చెన్నై రెండో విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిన కేంద్రప్రభుత్వం, ఈ ప్రాజెక్ట్ కోసం చర్యలు చేపట్టింది. పరందూర్‌లో విమానాశ్రయం ఏర్పాటుచేస్తామని ప్రకటన వెలువడిన రోజు నుంచి ఏకనాపురం గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో తమ నివాసాలు, భూములు కోల్పోయి రోడ్డున పడతామంటూ వారు పలురకాల ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, ఏకనాపురం గ్రామ పరిసరాల్లో 900 ఎకరాలు సేకరించనున్నట్లు, అందుకు ఆక్షేపలుంటే తెలపాలని అధికారులు ప్రకటించారు. దీంతో, మంగళవారం సుమారు 200 మంది గ్రామస్తులు ర్యాలీగా కారై ప్రాంతంలో ఉన్న ప్రత్యేక జిల్లా రెవెన్యూ అధికారి (భూ సేకరణ) కార్యాలయానికి చేరుకొని, విమానాశ్రయ ఏర్పాటుకు తాము భూములు ఇవ్వమంటూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.



రాష్ట్ర ప్రతిభా పాటవాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాన్‌ముదల్వన్ పథకం కింద వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైనందుకు కొరట్టూరులోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయంలో మంత్రి ఉదయనిధి నుంచి నగదు బహుమానం, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు